# ఆవు - పులి

"మీకు మాకు పరస్పర విరోధం. కావలిస్తే పంచాగం చూసుకో..."

కలియుగే, ప్రథమపాదే, జంబూద్వీపే, భరతవర్షే, భరత ఖండే అస్మిన్ వర్తమానేన వ్యావహారిక చంద్రమానేన .. సంవత్సరాణాం.

నాలుగు వేదాలూ నమిలేసిన ఆ అగ్రహారం ఒక కొండవార నీడలో ఉంది. అక్కడ అన్ని కులాల వాళ్ళూ తమ కుల వృత్తులు చేసుకుంటూ, ధర్మాన్ని పెంపొందిస్తూ, అధర్మాన్ని అసహ్యించు కుంటూ, చల్లగా, హాయిగా జీవిస్తున్నారు. ఏడాదికి మూడు కుంచాల వర్షం, పరదహారణాల పంటా వారికి మామూలు ఐపోయేయి. కలికాలం అయినా వారు ధర్మాన్ని పిలక పట్టుకొని నాలుగు కాళ్ళమీదా నడిపిస్తున్నారు. ఇది ఇలా ఉండగా ఆ ఊరు ఒక స్వామి వచ్చేరు. వారు వేదాల్నీ, వేదాంగాల్నీ ఏనాడో నమిలేసేరు. సకల శాస్త్రాలనీ పిడిచి తాగేసేరు. వారు చూపులకి బంగారం పిసికి చేసినట్టు ఉంటారు. ఇన్ని ఉన్నా, వారికి నాది అని చెప్పుకోడానికి కౌపీనం మినహా ఇంకేమీ లేదు.

వేదవేదాంగాలు చదివిన వారికి కూడా ఆకలి వేస్తుంది. స్వామి పాలు మినహా ఇంకేమీ పుచ్చుకోరు. అంచేత ఒక వైశ్య శిఖామణి వారికి దూడతో సహా ఒక ఆవుని దానం చేశాడు.

ఆవు నల్లగా వుంటుంది. దూడ కూడా నల్లగానే ఉంటుంది. ఆవుకి ఎక్కడా మచ్చలేదు. దూడకి కూడా లేదు. దూడ నెమ్మదైంది. ఆవు ఇంకా నెమ్మదైంది. దాన్ని ఎంచేతో కామధేనువు అని పిలవకుండా 'గంగిగోవు' అని పిలిచేవారు ప్రజ. అది ఏ పొలంలో మేసినా ఎవరూ అడ్డుపెట్టరు. అయినా అది తనపేరు సార్థకం చేసుకోవడానికే అన్నట్టు ఎవరి పొలంలోనూ మేయక, దొంగపాలు యజమానికి యివ్వడం యిష్టం లేక, అది కొండ వార పచ్చికలో మేసేది. కొండ దిగువ ఏట్లో నీళ్ళు తాగేది. గడ్డీ, నీళ్ళు కలిసి చిక్కటి పాలు యిచ్చేది.

మంచి కాలం యిలా కొంత గడిచేక ఆ వేళ మధ్యాహ్నం ఝామున్నరైంది.

గంగిగోవు మేస్తున్న బీటిలో పచ్చిక భూమ్మీద పరుచుకున్న మేఘంలా ఉంది. దానిమీద పడిన కొండ నీడ – నీటి నీడలా చల్లగా ఉంది. దూరం నుండి చూస్తే పచ్చికలో మేస్తున్న గంగిగోవు – వెన్న కంపెనీ ఎడ్వర్‌టైజ్‌మెంట్ బొమ్మ ఆవులా అందంగా, ఆరోగ్యంగా ఉంది.

అంతలో గంగిగోవు తల ఎత్తి చూసింది. కొండనీడ చింత తోపు చివరికి వచ్చేసింది. అంతే అమ్మబాబోయ్ ఆశ్రమానికి వెళ్ళి పోవలసిన కాలం వచ్చేసిందన్నమాట. గంగిగోవుకి యింకా ఆకలి తీరలేదు. అయినా అది దొంగ గొడ్డు కాదు కాబట్టి ఇంటికి వెళ్ళడానికి వాగు వేపు పరుగెత్తింది.

వాగు నీటిలో కొండ రంగు కరిగినట్టు నీరు నీలిగా ఉంది. కొండమీద ఓషధులసారం అంతా గ్రహించినట్టు ఆ నీరు చాలా చల్లగానూ, ఉత్తేజకరంగానూ ఉంది.

గంగిగోవు నాలుగు గుక్కలు నీరు తాగిందో లేదో దానికి వాగు గట్టుమీద నుండి ఒక భయంకరమైన అరుపు వినిపించింది. ఆ అరుపుకి నీరు గడ్డకట్టిపోయింది. అప్పుడు గంగిగోవు చూలుతో ఉండి ఉంటే దాని కడుపులో పిల్ల చచ్చిపోయేది.

గంగిగోవు తల ఎత్తేసరికి దానికి దగ్గర్లోనే ఒక నల్ల రాతిమీద ఒక వింత జంతువు నిలబడి ఉంది. అది రాజుగార్లా దర్జాగా ఉండడమే కాకుండా, అప్పుడే నిద్రలేచిన రాజుగారి కలా బద్ధకంగా కూడా ఉంది.

గంగిగోవు అమాయకంగా ఆ జంతువేపు చూసింది.

"నేను పులిని" అంది ఆ జంతువు.

"మిమ్మల్ని కలుసుకున్న నేను అదృష్టవంతురాల్ని" అంది ఆవు.

"నా కాకలేస్తోంది" అంది పులి.

"పాలిచ్చేదా?" అంది అమాయకంగా ఆవు.

"మేం పులిపాలు తప్పతాగం" అధికారకంగా ప్రకటించింది పులి.

"ఇక్కడి గడ్డి కూడా చాలా రుచిగా వుంటుంది"

"గడ్డి గోవులు తింటాయి" – నిరసనగా నవ్వింది పులి.

"మరి మీరు...?"

"గోవుల్ని తింటాం. మీకూ, మాకూ పరస్పర విరోధం. కావలిస్తే పంచాంగం చూసుకో"

ఆవుకి నోట మాట రాలేదు. పులిని చూస్తే అది అబద్ధమాడే రకంలా లేదు.

"నా మాట అబ్ధమేమో చూడు. నిన్ను మెల్లిగా పంజాతో ఒక దెబ్బ కొడతాను. ఆ తర్వాత పూర్తి దెబ్బ తట్టుకోగల వేమో చూడు అని అర సెకండు ఆగకుండా గంగిగోవు తలమీద పాపు బలంతో ఒక దెబ్బ కొట్టింది" పులి.

ఆవుకి యినపరాయితో తలమీద ఎవరో రాక్షసుడు కొట్టినట్టు అయింది. తల పగిలిపోయినట్టు రక్తం చిమ్మింది. కళ్ళలో రక్తంపడి ఎదురుగా ఉన్న పులి రక్తంలో స్నానం చేసిన దానిలా భయంకరంగా కనిపించింది.

నువ్వు నల్లదానివి, అంటే మంచిదానివీ, తెలివైన దానివీ అన్నమాట. నేను నిన్ను అరక్షణంలో చంపగలననీ ఈ పాటికి గ్రహించే ఉంటావు. ఇంత మంచిదానివి నిన్ను ఎక్కువ బాధపెట్టి చంపదలచుకోలేదు. నువ్వు పెనుగులాడకుండా ఉంటే మూణ్ణిమషాల్లో పని పూర్తి చేస్తాను అంది పులి పనిలోకి దిగడానికి సిద్ధపడుతూ.

ఆవు పవిత్రమైన ఆశ్రమ వాతావరణంలో పెరిగింది. చావు అంటే ఈ ఐహిక బంధాల నుండి ఆత్మవిముక్తి పొందడం అని ఏనాడో గ్రహించినదవడం వల్ల, పులి అన్నమాటకు జడవలేదు. కాని దాని మనసు ఒక్కసారి ముడిపడినట్టు బాధపడింది. తన పిల్లని తల్చుకోగానే.

అంచేత "ఓ పులి పుంగవా? నేను గోవుని. అంటే జీవ రాసుల్లో పవిత్రమైనదాన్ని. నీ ఆకలి తీర్చే అవకాశం ఇచ్చిన నీకు ఎలా ధన్యవాదాలు చెప్పుకోవాలో తెలియడం లేదు. నువ్వు కొట్టిన చావుదెబ్బతో బతకడం చావుకన్న దుర్భరంగా ఉంది. కాని ఒక్క మనవి. ఇప్పుడు నీ అంత ఆకలితోనూ నా బిడ్డ ఆశ్రమంలో కిరకిరలాడుతూ ఉంటుంది. కాబట్టి నాకు వ్యవధి యిస్తే దాని ఆకలి తీర్చి క్షణంలో వచ్చేస్తా. అప్పుడు నువ్వు కొమ్ముల్తో సహా తినెయ్యి అంది.

పులి ఆలోచిస్తూ కళ్ళు మూసుకుంది.

"నీకు దూడవుందని నేను నమ్మను" అంది కళ్ళు తెరవ కుండా.

"నా ఈ చేసిన పొదుగు చూడు" తనన్న మాట నిజమన్న నమ్మకంతో అంది గంగిగోవు.

"చేట పెయ్యలకి చేసే జాతి నీది" అంది ఎగతాళిగా పులి.

ఆవు అంతరాత్మ. ఆత్మాభిమానం దెబ్బతిన్నాయి. నా దూడని నాతోకూడా తెస్తే అది బతికే ఉందని నమ్ముతావా? అంది ఆవు రోసంగా నోట్లోకి కారిని రక్తాన్ని కక్కుతూ.

అలా అయితే నమ్ముతా, కాని వేగం వచ్చేయ్ అనుమతించింది పులి.

❖ ❖ ❖

తర్వాత హంశాలు చకచకా జరిగిపోయేయి.

బాధతోనూ, ఆత్రుతతోనూ గంగిగోవు ఆశ్రమానికి పరిగెత్తింది. తన దూడకి ఆఖరిసారి తనివితీరా పాలు ఇచ్చుకుంది. పాలిస్తున్నప్పుడు దాని రక్తం దూడమీద కూడా పడింది.

ఆ తర్వాత గంగిగోవు పిల్లతో సహా హాజరైంది పులి దగ్గరకి.

"నీ నిజాయితీకి నేను మెచ్చేను" అని పులి దాన్ని అభినందించింది.

తర్వాత – ముందు దూడనీ, తర్వాత ఆవునీ తినేసింది.

**(1971)**

# తొడిమిలేని పువ్వు

**సం**తుష్టిగా భోంచేసిన తృప్తితో వళ్ళు బద్ధకం విరుచు కొని ట్రావెలర్స్ బంగళా వరండాలో ఈజీ చైర్లోవాలి ఆనందరావు సిగరెట్టు వెలిగించేడు. ఐదడగుల పదంగుళాల పొడవూ, అంతకు సరిపడిన దానికంటే కాస్త ఎక్కువ ఒడ్డూగల అతను చిన్న చూపంటూ ఎరగడు. అతను చేసే ఏపనైనా పెద్దపెట్టున వుంటుంది. అతని ప్రతిప్లానూ అతి భారీగా వుంటుంది. అతను ఎమ్మేల్యే అయి వుంటే ఏనాడో మినిస్టరై ఉండేవాడు. అతను ప్రైమినిష్టరైతే యేనాడో దేశాన్ని అమెరికాకి అమ్మేసి వుండేవాడు. అతనికి ముందు చూపు ఎక్కువ. తన అంచనాలలో అతను ఎప్పుడూ దెబ్బతినలేదు. జీవితంలో తన ఆట గెలవటానికి ఏపనైనా సంతోషంగా చేసేసే శక్తి అతనికుంది. అతను తెలిసుండీ– కావాలనే – కురూపిని పెళ్ళాడేడు. పెళ్ళినాటి ప్లాను పనిచేసి అతనిప్పుడు డి.యస్పీ.ఐ కూర్చున్నాడు. బాహాటంగా "నా" అని చెప్పు కోడానికి ఒక కారూ, ఒక భార్యా, ఆల్సేషియన్ కుక్కలాంటి పొలిటీషియన్ మామా, హైదరాబాదులో ఒక యిల్లు, ఏభైవేల యిన్సూరెన్సు పోలసీ, జీవితంలో ముందుకు పోతామన్న విశ్వాసం అతనికున్నాయి.